క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఆదిలాబాద్‌రూరల్: వర్షాలు కురుస్తున్నందున వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి సర్ఫ్రాజ్ అన్నారు. శనివారం మండలంలోని కొలాంగూడ, అంకాపూర్ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్ వైజర్ మర్సకొల లక్ష్మీబాయి, బొమ్మెత సుభాష్, హెల్త్‌అసిస్టెంట్‌లు నల్ల ఈశ్వర్ రెడ్డి, ఈశ్వరీ దేవి, వేణుతాయి, కౌసల్యా, అంగన్‌వాడీ టీచర్ శోభబాయి పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

ఇంద్రవెల్లి: మండలంలోని పిప్రి గ్రామం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి, బదిలీపై వెళ్లిన లక్ష్మణ్‌రావ్, పదవీకాలం పూర్తయిన ఎంపీటీసీ కోరెంగా సులోచనలను శనివారం విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడిగా లక్ష్మణ్‌రావ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, గ్రామస్తులు కోడప అశోక్, కోరెంగా సుంగుపటేల్, శ్రీకాంత్, శ్రీనివాస్, జుగాదిరావ్, సుభాష్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ అందజేత

ఇచ్చోడ: మండలంలోని బోరిగామ అంగన్‌వాడీ కేంద్రానికి శనివారం గ్లోబల్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కిట్ అందచేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉయికే లక్ష్మణ్ మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా అంగన్‌వాడీలో చదువుతున్న చిన్నారులు ఆటలు ఆడేందుకు ఉపయోగపడే ఆట వస్తువులను అందచేసినట్లు తెలిపారు. వీటిని అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు ఉపయోగించుకోవాలని కోరారు. ఆయన వెంట క్లస్టర్ కోఆర్డినేటర్ హేమలత, సంతోష్, అంగన్‌వాడీ కార్యకర్త, తదితరులు పాల్గొన్నారు.

టూటౌన్ సీఐగా కరుణాకర్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ టూటౌన్ సీఐగా సీహెచ్ కరుణాకర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇదివరకు సీఐగా పనిచేసిన అశోక్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయం నుంచి ఆదిలాబాద్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన అశోక్ ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

వారసంత వేలం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే వారసంత వేలంను శనివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈవో సంజీవ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వారసంతకు రూ. 6లక్షల 30 వేలు, రోజు వారి మార్కెట్‌కు రూ. 2 లక్షల40వేలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వేలం కాల పరిమితి వచ్చే మార్చి వరకు ఉంటుందన్నారు.

నార్నూర్: మండల కేంద్రంలో ప్రతీ బుధవారం నిర్వహించే వారసంత తైబజార్ వేలంను మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో జవహర్, ఎంపీవో సత్యానందలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తైబజార్ వేలంలో మొత్తం 12 మంది పాల్గొన్నారు. ఒక్కొక్కరి వద్ద రూ, 50 వేలు డిపాజిట్ తీసుకోవడం జరిగిందన్నారు. మండల కేంద్రానికి చెందిన ఆడే రామ్ నివాస్ రూ. 5.50 లక్షలకు తైబజార్‌ను దక్కించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాగ్, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి మరింత కృషి

తలమడుగు: రుయ్యాడి గ్రామ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తాజా మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామపంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ పదవీకాలంలో సహకరించిన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతరెడ్డి, హెచ్‌ఎం భరత్, ప్రకాష్ రెడ్డి, సంజీవరెడ్డి, జీవన్‌రెడ్డి, ప్రసాద్, గంగాధర్, అభవ్, గంగన్న పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో ఇటీవల ఇద్దరు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను శనివారం బాధిత కుటుంబసభ్యులు పరామర్శించారు. వంజరి రాజలింగు మరణించడంతో పాటు ఆడెపు శ్రీనివాస్ తల్లి మృతిచెందారు. ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీ వెంట బీజేపీ నాయకులు గాదె శంకర్, బొక్కపెల్లి రాములు, ఆడెపు రమేశ్, కూన రాములు ఉన్నారు.

తలమడుగు: మండలంలోని మందగూడ గ్రామానికి చెందిన (ప్రభుత్వ ఉపాధ్యాయుడు) మెస్రం కిషన్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా.. శనివారం బాధిత కుటుంబసభ్యులను ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ పరామర్శించారు. బీజేపీ నాయకులు చంద్రకాంత్, దాంజీపటేల్, వామన్ పటేల్, హన్మంతు, దాదారావు, వెంకటస్వామి ఉన్నారు.

వనమహోత్సవానికి సిద్ధం

- బల్దియా లక్ష్యం 5 లక్షల మొక్కలు
- నాటేందుకు స్థలాల గుర్తింపు



గాంధీపార్కులోని నర్సరీలో మొక్కలు

కైలాస్‌నగర్: పచ్చదనాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన వనమహోత్సవానికి బల్దియా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఆదిలాబాద్ పట్టణ పరిధిలో మొత్తం 5 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. అందుకనుగుణంగా స్థలాల గుర్తింపుపై దృష్టి సారించారు. పట్టణంలోని పల్లె ప్రకృతివనాలతో పాటు రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటేలా కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. ఇళ్లలోనూ నాటేందుకు అవసరమైన పూలు, పండ్ల మొక్కలను అందించేలా ప్రణాళిక రూపొందించారు. జోరుగా వర్షాలు కురిస్తే ప్రతీవార్డు పరిధిలోనూ మొక్కలు నాటేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

స్థలాల గుర్తింపు..

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో మొత్తం 49 వార్డులున్నాయి. వీటి పరిధిలో ఈ యేడాది వనమహోత్సవంలో 5 లక్షల మొక్కలను నాటాలని సంకల్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మొక్కలు నాటేందుకు అవసరమైన స్థలాలను గుర్తించారు. 12 పల్లె ప్రకృతి వనాలు, దుర్గానగర్ అటవీ నర్సరీ, బంగారుగూడలోని డంపింగ్‌యార్డు, మావల మండల కేంద్రంలోని గ్రీన్ వ్యాలీ, అనుకుంట గ్రామంలోని ప్రభుత్వ ఖాళీ ప్రదేశాలుతో పాటు మిషన్ భగీరథ రిజర్వాయర్లు వంటి ప్రాంతాల్లో మొక్కలు నాటాలని నిర్ణయించారు. వీటితో పాటు ఆదిలాబాద్ పట్టణంలోని ఐలవ్ ఆదిలాబాద్ సెల్ఫీ పాయింట్ నుంచి కేఆర్‌కే కాలనీ, న్యూహౌజింగ్ బోర్డులోని వివేకానంద చౌక్ నుంచి జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఇందిరమ్మ కాలనీ వరకు రోడ్లకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ చేపట్టేలా ప్రణాళికను సిద్ధలు చేశారు. వీటితో పాటు గత తొమ్మిది విడతలుగా నాటిన మొక్కల్లో ఎండిపోయిన, పశువులు తినేసినటువంటి గ్యాప్‌ల్లోనూ మొక్కలను నాటనున్నారు.

నాలుగు నర్సరీల్లో మొక్కలు

పట్టణంలోని నాలుగు చోట్ల బల్దియా అధికారులు నర్సరీలను ఏర్పాటు చేశారు. టీటీడీసీలోని నర్సరీలో 20వేలు, గాంధీ పార్కులో 25 వేలు, పాలశీతలీకరణ కేంద్రంలో 21వేలు, బంగారుగూడలోని నర్సరీలో 10వేల చొప్పున మొక్కలను పెంచారు. అటవీశాఖకు సంబంధించిన నర్సరీలో నుంచి 30 వేల మొక్కలను తీసుకోవాలని నిర్ణయించారు. బల్దియాకు సంబంధించి నాలుగు, అటవీశాఖ నర్సరీతో కలిపి మొత్తం ఐదు నర్సరీల్లో 1,06, 000 మొక్కలు ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నాయి. పట్టణ అవసరాలకు అనుగుణంగా మిగతా మొక్కలను డీఆర్‌డీఏ లేదా అటవీశాఖ నర్సరీల నుంచి కొనుగోలు చేయాలని నిర్ణయించారు.

బాధ్యతగా భావించాలి



వనమహోత్సవంలో భాగంగా ప్రతీ కాలనీలో మొక్కలు నాటేలా స్థలాలను గుర్తించాం. మొక్కలు కూడా నర్సరీల్లో సిద్ధంగా ఉన్నాయి. వర్షాలు సమృద్ధిగా కురిసిన వెంటనే మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతాం. పట్టణ ప్రజలు ప్రతిఒక్కరూ వన మహోత్సవాన్ని బాధ్యతగా భావించాలి. – యూనూస్, డీఈ, ఆదిలాబాద్

ప్రతిఒక్కరూ ప్రకృతిని కాపాడాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: ప్రతిఒక్కరూ ప్రకృతిని కాపాడాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఏక్ పేడ్ మాకే నామ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ గొప్ప ఆలోచనతో వాతావరణ సమతూల్యత, మనిషి మనుగడకు మొక్కలు అవసరమని ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రతిఒక్కరూ అమ్మ పేరిట ఒక మొక్క నాటాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, లెక్చరర్లు రఘునాథ్, జగ్‌రాం, లాలమున్న, రత్నాకర్ రెడ్డి, రఘుపతి, శివ, మురళీధర్ పాల్గొన్నారు.

- చెట్లతో వాతావరణం సమతూల్యంగా ఉంటుందని ప్రభుత్వ సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీరస్వామి అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పచ్చదనం, కాలుష్య నివారణతో పాటు అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడీలు రాజ్‌కుమార్, రాజన్న, క్రాంతికుమార్, సుజయ్, మాషయ్య, లెక్చరర్లు శ్రీనివాస్, విజయలక్ష్మి, యశస్వి, సురేశ్, జ్యోత్స్నరాణి, రామేశ్వర్, సుధాకర్ పాల్గొన్నారు.

బీఫ్ విక్రయదారులతో కమిషనర్ సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ ఖమర్ అహ్మద్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం ఇందిరమ్మ కాలనీలోని పశువధశాల తరలింపుపై మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ శనివారం బీఫ్ విక్రయదారులతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కాలనీవాసుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్న విషయాన్ని వ్యాపారులకు వివరిస్తూ.. బంగారుగూడ డంపింగ్‌యార్డు వద్ద వారి కోసం ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించినట్లుగా తెలిపారు. అక్కడ వసతుల కల్పన కోసం రూ.15లక్షలు పట్టణ ప్రగతి కింద మంజూరు చేస్తు ఎజెండాలో పొందుపర్చి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించిన విషయాన్ని వివరించారు. ఇందుకు వ్యాపారులు స్పందిస్తు అక్కడికి వెళ్లేందుకు తమకెలాంటి అభ్యంతరం లేదని కాకుంటే అక్కడ ఎలాంటి వసతులు లేవన్నారు. తాత్కాలికంగానైన షెడ్డు, కంపౌండ్ వాల్, నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, తదితరులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకర్ల నిర్వాహకులతోనూ..

పట్టణంలోని సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ నిర్వాహకులతోనూ కమిషనర్ సమావేశమయ్యారు. పట్టణంలో సేకరించిన మలవ్యర్థాలను డంపింగ్‌యార్డులోని మున్సిపల్ పారిశుధ్య వనరుల కేంద్రానికి తరలించాలని సూచించారు. తాము మలవ్యర్థాలను తీసుకెళ్లినప్పటికి ప్లాంట్ నిర్వాహకులు మోటర్ పనిచేయడం లేదని చెబుతున్నారని కమిషనర్‌కు తెలిపారు. దీంతో ప్లాంట్ నిర్వాహకులతోనూ కమిషనర్ మాట్లాడారు. పట్టణంలోని ఏ కాలనీలోని ఇంటి నుంచి మల వ్యర్థాలను సేకరించారు. ప్లాంట్ వద్దకు ఎప్పుడు తీసుకెళ్లారనే వివరాలతో కూడిన రిజిస్టర్లను నిర్వహించాలని ఆదేశించారు.

కోర్టు సమస్యలు పరిష్కరించాలి



హైకోర్టు న్యాయమూర్తిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉట్నూర్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆదిలాబాద్ జిల్లా కోర్టులో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కోర్టుకు రెగ్యులర్ జడ్జిని నియమించాలని అదే విధంగా కోర్టు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు అనంతరం న్యాయవాదులు జడ్జికి పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి, ప్రధాన కార్యదర్శి బానోత్‌జగన్ నాయక్, జమీర్ ఖాన్, జైవంత్‌రావు, వసంత్‌రావు, కుడెల్లి అశోక్, నాతరి రాజు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ఎంఈవో భూమారెడ్డి



పూలమొక్క అందజేస్తున్న ఎంఈవో భూమారెడ్డి

నేరడిగొండ: ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేశ్‌ను నేరడిగొండ మండల విద్యా శాఖాధికారి భూమారెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి పూలమొక్క అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి, గంగాధర్, వడూర్ గ్రామ పెద్దలు గాదె శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు

బోథ్: బోథ్ మండలంలోని బోథ్(బి), కనుగుట్ట శివారులో ఆదివారం పంటల నమోదు చేపడుతున్నట్లు వ్యవసాయ విస్తరణ అధికారులు పేర్కొన్నారు. రైతులు అందుబాటులో ఉండాలని కోరారు. క్షేత్రస్థాయిలో వెళ్లి పంటల నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు సీఆర్ఆర్ వర్ధంతి

కైలాస్‌నగర్: మాజీ మంత్రి చిల్కూరి రామచంద్రారెడ్డి ప్రథమ వర్ధంతిని ఆదివారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. మావల మండల కేంద్రంలోని చిల్కూరి లక్ష్మిగార్డెన్‌లో నిర్వహించే కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

శుద్ధ జలయంత్రం అందజేత

గుడిహత్నూర్: మండల కేంద్రానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే తన జన్మదిన పురస్కరించుకొని స్థానిక సరస్వతి శిశు విద్యా మందిర్ పాఠశాలకు శుద్ధ జల యంత్రాన్ని విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు అంకత రవీందర్, నాయకులు కేంద్ర జ్ఞాను, షబీర్ ఖాన్, జమీర్ ఖాన్, సలీం ఖాన్, గౌస్, పాఠశాల హెచ్‌ఎం రమాదేవి పాల్గొన్నారు.

రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్, ఆదిలాబాద్ నుంచి గుంటూరు, ఒంగోలుకు వెళ్లే సూపర్ లగ్జరీ, లహరి సర్వీసుల్లో రాయితీ కల్పిస్తున్నట్లు ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణం కోసం ఈ సర్వీసుల్లో వెళ్లడానికి, తిరుగు ప్రయాణానికి ముందస్తుగా టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులకు 10 శాతం రాయితీ ఉంటుందన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



గురుకులం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల: మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకులంలో మౌలిక వసతులు కల్పించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎట్టకేలకు లీజు తీసుకున్న నూతన భవనంలో గురుకులం ప్రారంభించారు. తరగతి గదులు, వంటగది, స్నాన గదులు, నల్లాల బిగింపు, మైదానం, తదితర సౌకర్యాలను పరిశీలించారు. 90 శాతం పనులు పూర్తయ్యాయని, మిగతా మౌలిక వసతుల పనులు పూర్తి కాలేదని ఆర్‌సీవో రాథోడ్ గోపిచంద్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులను వెంటనే పూర్తి చేయించాలన్నారు. ప్రిన్సిపాల్ రంగన్న, మండల ప్రత్యేకాధికారి శంకర్, బీజేపీ నియోజవర్గం ఇన్‌చార్జి బోయర్ విజయ్, దత్తా నిక్కమ్, బోనిగిరివార్ గణేష్, రామెల్లి మోరేశ్వర్, మెంచు నరేందర్ పాల్గొన్నారు.

ఘనంగా సహకార దినోత్సవం



పాల్గొన్న చైర్మన్, డైరెక్టర్లు



జెండా ఆవిష్కరిస్తున్న సంఘ చైర్మన్ రమేశ్

నేరడిగొండ: అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు కుమారి గ్రామ సహకార సంఘాల్లో శనివారం సప్త రంగుల పతాకాలను ఆవిష్కరించారు. మండల కేంద్రంలో సంఘ చైర్మన్ సాబ్లే కిషోర్ సింగ్, కుమారిలో మందుల రమేశ్‌లు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఏటా అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో సీఈవోలు బారె నాగభూషణ్, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

బోథ్: బోథ్ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్ సప్తరంగుల జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గొర్ల రాజు యాదవ్, లోలపు పోశెట్టి, జిట్ట శ్రీనివాస్ కార్యదర్శి స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో చైర్మన్ మేకల వెంకన్న ఏడు రంగుల పతకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు వినీల్, రాజేంద్ర ప్రసాద్, సత్యనారాయణ, దేవరావు, లింగన్న, కార్యదర్శి నారాయణ గౌడ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

జైనథ్: రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా కార్యాలయంలో సహకార జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల అభ్యున్నతికి సహకారం సంఘాలు ఎంతగానో కృషి చేస్తున్నాయన్నారు. రైతులకు సకాలంలో వివిధ రకాల రుణాలు అందించడంతో పాటు ఎరువులు సైతం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కరుణాకర్, కార్యదర్శి గంగన్న, సిబ్బంది పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మహనీయుల జయంతి, వర్ధంతిలను జరుపుకోవడమే కాకుండా వారి ఆశయాల సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సంఘ సంస్కర్త, స్వాతంత్ర సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు శనివారం జిల్లా కేంద్రంలోని జగ్జీవన్‌రాం చౌక్ లోని విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి, సమాజానికి బాబు జగ్జీవన్ రాం చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో జైనథ్ మాజీ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, మావల మాజీ ఎంపీపీ దర్శనాల సంగీత ఏవన్, పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేశ్, చరణ్ గౌడ్, కౌన్సిలర్ ఆవుల వెంకన్న, గిమ్మ సంతోష్ పాల్గొన్నారు.

- అణగారిన కులాల అభివృద్ధితో పాటు వారిని చైతన్య పరిచేందుకు జగ్జీవన్‌రామ్ ఏనలేని కృషి చేశారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం బాబు జగ్జీవన్‌రాం వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రాం చౌక్‌లో గల ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత కుమారి, కార్పొరేషన్ ఈడీ శంకర్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అతిచిన్న వయస్సులో చట్టసభలో అడుగుపెట్టిన జగ్జీవన్‌రామ్ వివిధ మంత్రిత్వ శాఖల ద్వారా దేశానికి ఉత్తమమైన సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడరు చిట్టి రవి, దుబ్బాక సుభాష్, సిరిసిల్ల భూమయ్య, జన్నారపు సాయి, దుబ్బాక చందు, పసుల శ్రీకాంత్, కల్లేపల్లి రాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌వీర్

నేరడిగొండ: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలలో సీజనల్ వ్యాధులపై వైద్య, ఐసీడీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వ్యాధులు సోకకుండా, పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని కోరారు. గ్రామాల్లో రోజువారి శుభ్రత చర్యలు పంచాయతీ కార్యదర్శులు కార్మికుల ద్వారా చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో లక్ష్మణ్, వైద్యాధికారి సద్దాం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, వైద్య సిబ్బంది హరికుమార్ గౌడ్, రాంనరేశ్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

తలమడుగు: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తహసీల్దార్ రాజమోహన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. నేటి శాస్త్ర సాంకేతిక యుగంలో మనిషికి మానసిక ప్రశాంతత లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గల దేవాలయాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక, సాంగత్యాలకు వెళ్లి మానసిక ప్రశాంతత పొందాలని సూచించారు. చెడుకు దూరంగా ఉండి భక్తిమార్గంలో పయనించాలన్నారు. తలమడుగు వేంకటేశ్వర ఆలయంలో ప్రతీ శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు అన్నదాన, కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో వినోద్ కుమార్, రాంరెడ్డి, బడిగర స్వామి, రమేశ్, అశోక్, సీఈవో శ్రీనివాస్, ఆసం రవి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఎంపీకి వినతి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్: మావల మండల పరిధిలోని సర్వే నెంబర్ 72లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న ఆదివాసీలకు ఇళ్ల పట్టాలు అందించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు ఎంపీ గోడం నగేశ్‌ను కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కాలనీవాసులు, తుడుందెబ్బ నాయకులు కలిసి వినతిప్రతం అందజేశారు. సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేశ్ మాట్లాడుతూ.. కుమరం భీం కాలనీలో ఆదివాసీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గిరిజనుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పలువురు రాజకీయ నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెట్టి మనోజ్, ప్రకాష్, మెస్రం తులసీరామ్, కుమరం గోవిందరావు, కోట్నాక్ ఆనంద్, ఉయిక చందు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి

నేరడిగొండ: జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన నూతన చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి అన్నారు. శనివారం మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో మహిళ, శిశు సంక్షేమ శాఖ, మహిళ సాధికార కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినులకు చట్టాలు, చదువు ప్రాముఖ్యత, సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో రాణించే విషయాలపై అవగాహన కల్పించారు. నూతన చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్‌రావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.